
# జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శనివారం 29 11 2025
సంపుటి 1 సంచిక 9
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195





1993: పారిశ్రామికవేత్త, తొలి విమాన చోదకుడు జె.ఆర్.డి.టాటా మరణం




చరిత్రలో ఈ రోజు

1759: గణిత శాస్త్రవేత్త నికోలస్ బెర్నోలీ మరణం. (జ.1687)
1877: థామస్ ఆల్వా ఎడిసన్ చే మొదటిసారి ఫోనోగ్రాఫ్ ప్రదర్శింపబడినది.
1929: భూ దక్షిణ ధృవం గగన తలంలో మొట్టమొదటిసారి యు.ఎస్ అడ్మిరల్ రిచర్డ్ బయర్డ్ ఎగిరాడు.
1947: హైదరాబాదు నిజాము, భారత ప్రభుత్వముల మధ్య యథాతథస్థితి ఒప్పందం కుదిరింది.
2009: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సిద్దిపేటలో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు.



### మెగా సిటీగా హైదరాబాద్

నవాబుల కాలం నాటి భాగ్యనగరం మరో చారిత్రక మలుపు తిరగబోతోంది. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ , ఇక పై బృహత్ నగరంగా అవతరించనుంది. 4



### కోకాపేటలో ఎకరం 151.25 కోట్లు

శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. 3



### చారిత్రాత్మక దీక్షకు 16 ఏళ్ళు.!


తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన దీక్షకు పదహారేళ్లు . ఈ నేపథ్యంలో శనివారం నాడు సిద్దిపేట లో ఘనంగా దీక్షా దివస్ వేడుకలు నిర్వహించనున్నారు 4

# హైదరాబాదీ రుచులకు గ్లోబల్ గుర్తింపు

**ప్రపంచంలోని ఉత్తమ 100 నగరాల జాబితాలో...**

**'టేస్టీ అట్లాస్' విడుదల చేసిన టాప్ 100 టేస్టీ సిటీల జాబితాలో హైదరాబాద్.**

**దశ, హైదరాబాద్:** ప్రపంచంలోని ఉత్తమ 100 నగరాల జాబితాలో భారత్‌కు చెందిన నాలుగు ప్రధాన నగరాలు స్థానం దక్కించుకున్నాయి. వాటిలో బెంగళూరు, ముంబై, ఢిల్లీతో పాటు హైదరాబాద్ కూడా గ్లోబల్ టాప్100లో నిలిచింది. సాంకేతిక విస్తరణ, ఆధునిక మౌలిక సదుపాయాలు, కార్పొరేట్ అవకాశాలు, నగర జీవనశైలిలో వేగవంతమైన మార్పులు.. ఇవి హైదరాబాద్‌కు ఈసారి కీలకమైన ప్లస్ పాయింట్లుగా మారాయి. ప్రపంచ వ్యాప్తంగా బెస్ట్ నగరాల జాబితో బెంగళూరు 29వ స్థానం, ముంబై 40వ స్థానం, ఢిల్లీ 54వ స్థానం సాధించగా.. హైదరాబాద్ 82వ స్థానంలో నిలవగా.. దేశవ్యాప్తంగా నాల్గవ బెస్ట్ సిటీగా నిలిచింది. చెన్నై, కోల్‌కతా వంటి పాత మెట్రో నగరాలను వెనక్కు నెట్టి ఈ స్థానం పొందడం ప్రత్యేకంగా మారింది.హైదరాబాద్ కేవలం ఐటీ, బిజినెస్ హబ్ మాత్రమే కాదు.. ప్రపంచ ఫుడ్ మ్యాప్‌లో కూడా తనదైన స్థానం సంపాదిస్తోంది. 'టేస్టీ అట్లాస్' విడుదల చేసిన టాప్ 100 టేస్టీ సిటీల జాబితాలో హైదరాబాద్ 50వ స్థానంలో నిలిచింది. బిర్యానీ, ఇరానీ టీ, హలీమ్, ఉస్మానియా బిస్కెట్ ఇలాంటి వంటకాల ప్రత్యేక రుచులు ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ లవర్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. మొఘలాయి, అరబిక్, పర్షియన్, టర్కిష్ వంటకాల ప్రభావంతో హైదరాబాదీ ఫుడ్ కల్చర్‌కు ఈ గుర్తింపు మరింత బలం చేకూర్చిందిఇక ప్రపంచంలో టాప్ 10 బెస్ట్ సిటీస్ సిటీస్ జాబితాకు వస్తే క్యాపిటల్ ఆఫ్ క్యాపిటల్స్'గా పేరున్న లండన్ మళ్లీ మొదటి స్థానాన్ని దక్కించుకోగా.. తర్వాతి స్థానాల్లో న్యూయార్క్, ప్యారిస్, టోక్యో, మాడ్రిడ్, సింగపూర్, రోమ్, బెర్లిన్ ఉన్నారు. అభివృద్ధి, వినోదం,



..మిగతా 4వ పేజీలో →



## ఫుడ్ డెలివరీ గోదాంల పై అధికారులు దాడులు

**దశ, హైదరాబాద్:** బ్లింకిట్, బిగ్ బాస్కెట్, జెప్టో, స్విగ్గీ, జోమాటో, జియోమార్ట్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్ గోదాంలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసారు. దాదాపు 75 గోదాములను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసారు. తనిఖీల్లో కుళ్ళిన పళ్ళు, ఎక్స్ పైర్డ్ ఫుడ్ ఐటమ్స్ స్వాధీనం చేసుకున్నారు. 75 గోదాం ల్లో 1903 యూనిట్ల కాలం చెల్లిన ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 76 కేజీల కుళ్ళిన కూరగాయలు,కాలం చెల్లిన ఆహార పదార్థాలను అక్కడే పారేయించారు. 32 సంస్థలకు నోటీసులు జారీ చేసారు.



## బిఆర్ఎస్‌కు అధిక స్థానాలల్లో గెలవాలి: కేటిఆర్

**ఈదశ, ఇబ్రహీంపట్నం:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ.. స్థానిక సర్పంచ్ ఎన్నికలలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని అత్యధిక స్థానాలు సాదించాలని తెలిపారు. అలాగే అత్యధిక స్థానాలు సాధించేలా తీసుకోవాల్సిన వ్యూహంపై మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డికి తగు సూచనలు, దిశానిర్దేశం చేశారు.




## ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్

**దశ, మహబూబాబాద్:** భూ భారతి రికార్డుల్లో పేరును నమోదు చేయడానికి లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామ శివారులోని పడమటి తండా గ్రామపంచాయతీకి చెందిన భూక్యా బాలు అనే రైతు తన తండ్రి మరణించారు.భూక్యా స్వామి మృతి చెందడంతో తండ్రిపేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద భూ భారతి రికార్డుల్లో నమోదు చేయించుకోవడానికి తహసీల్దార్ వీరగంటి మహేందర్‌ను కలిశాడు. రూ.25వేల లంచంను డిమాండ్ చేశారు. దీంతో చేసేది లేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం 15 వేల రూపాయలు ఇస్తూ శుక్రవారం ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బ్రదర్స్ మధ్య డీసీసి చిచ్చు

**డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించడంపై మంత్రి వెంకట్ రెడ్డి గుర్రుగా ఉంటే.. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్వాగతం**




**దశ, నల్గొండ:** తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త డీసీసీల నియామకం చిచ్చు రేపింది. చాలాచోట్ల అసంతృప్తి రచ్చకెక్కినప్పటికీ... నల్లగొండ డీసీసీ ఎపిసోడ్ మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. సొంత జిల్లాలో మాట నెగ్గించుకోవాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. అధిష్టానం నిర్ణయానికి ఓకే చెప్పాలని రాజగోపాల్ రెడ్డి.. చెరో విధంగా రెస్పాండ్ అవడం చర్చకు దారితీస్తోంది.పున్నా కైలాష్ నేతకు నల్గొండ డీసీసీ పగ్గాలు అప్పగించిన వేళ మంత్రి కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య కోల్డ్ వార్ న్యూస్ హెడ్ లైన్‌గా మారింది. కైలాష్ నేతను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించడంపై మంత్రి వెంకట్ రెడ్డి గుర్రుగా ఉంటే..ఆయన సోదరుడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్వాగతిస్తున్నారు.డీసీసీ అధ్యక్షుడిగా ఎంపికైన పున్నా కైలాష్ నేతను పార్టీ నుంచే తీసేయాలని జిల్లాకే చెందిన మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేస్తుండటం ఇప్పుడు హాట్టాపిక్గా మారింది. మంత్రి ఈ స్థాయిలో ఫైర్ కావడానికి కారణం లేకపోలేదట. నల్లగొండ డీసీసీగా తన ప్రధాన అనుచరుడు గుమ్మల మోహన్ రెడ్డికి ఇప్పించుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేశారు. మోహన్ రెడ్డికి దక్కకపోగా.. గతంలో తనపై తీవ్రమైన విమర్శలు చేసిన పున్నా కైలాష్ నేతకు రావడంతో జీర్ణించుకోలేకపోతున్నారట. సేమ్ టైమ్ పున్నా కైలాష్ గతంలో తనను ఉద్దేశించి మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతుండటంతో కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఇంకా రగిలిపోతున్నారట. ఈ నేపథ్యంలో పార్టీ తీసుకునే నిర్ణయాలపై సానుకూలంగా రియాక్ట్ కావాలని రాజగోపాల్ భావిస్తున్నారట. ఇదేసమయంలో మంత్రి కోమటిరెడ్డితీరును నిరసిస్తూ పున్నా కైలాష్ నేతకు మద్దతుగా బీసీ సంఘాలు సైతం రంగంలోకి దిగడం రచ్చ రాజేస్తోంది. ఈ వ్యవహారాన్ని హస్తం పార్టీ పెద్దలు ఎలా డీల్ చేస్తారో వేచి చూడాలి.



## "రంగారెడ్డి జిల్లా ఫర్ సేల్ అన్నట్టుగా కాంగ్రెస్ నిర్వాకం: మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**దశ, రంగారెడ్డి :** "రంగారెడ్డి జిల్లా ఫర్ సేల్" అన్నట్టుగా అధికార కాంగ్రెస్ నిర్వాకం ఉందని బీఆర్ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించగా... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జిల్లాను అమ్మకానికి పెట్టినట్టుగా వ్యవహరిస్తోందని, జిల్లా అభివృద్ధి కోసం కేసీఆర్ పెద్ద కంపెనీలను తీసుకొచ్చారు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం "ఫోర్త్ సిటీ" పేరుతో "ఫోర్ బ్రదర్స్" భారీ రియల్ ఎస్టేట్ దందాకు తెరలేపి.. స్వీయ లాభం కోసం పనిచేస్తున్నారన్నారు. దేశంలోనే అత్యధిక జిడిపి కలిగిన రంగారెడ్డి జిల్లాపై రేవంత్ రెడ్డి చూపు పడిందని, జిల్లాలోని శివారు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసి ప్రజలపై భారీ పన్నుల భారాన్ని మోపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రంగారెడ్డి జిల్లా ఉనికే ప్రశ్నార్థకంగా భావించేలా ప్రభుత్వం ముందుకెళ్తోందని, మా జిల్లా ఉనికి, హక్కులు కాపాడేందుకు ఎంతదూరమైన వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం... ఎంతవరకైనా పోరాడతామన్నారు.




## సర్పంచ్ పదవి కొనుగోలుపై ఈసీ ఆగ్రహం

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల వేళ ఏకగ్రీవాల కోసం గ్రామాల్లో వేలంపాటలు నిర్వహిస్తుండటంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎస్ఈసి, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్పంచ్ పదవిని అంగట్లో సరుకుగా మార్చి, డబ్బులు కుమ్మరించి కొనుగోలు చేయడం సరికాదని ఎస్ఈసీ స్పష్టం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య పద్ధతికి పూర్తిగా విరుద్ధమని హితవు పలికింది. ఇలాంటి అప్రజాస్వామిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఈసీ తీవ్రంగా హెచ్చరించింది. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని కమిషన్ ఉద్ఘాటించింది.

## సమ్మిట్ కు భారీ బందోబస్తు


- టి రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కమిటీ సభ్యులతో సిపి సమీక్ష సమావేశం
- వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు
- సుమారు 2,500 మంది పోలీసు బలగాలతో బందోబస్తు

4




డిసెంబర్ 8, 9వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహేశ్వరం, మిర్ఖాన్ పేటలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి పోలీసుశాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య భారీ బందోబస్త్ కల్పిస్తోంది.

## ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలైన పిటిషన్‌పై ఈ తీర్పు ఇచ్చింది. వెనుకబడిన కుల సంఘాలు గురువారం తెలంగాణ హైకోర్టులో ఎన్నికలపై స్టే కోరుతూ పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కులాలకు (ఎంబీసీ) రిజర్వేషన్లు కేటాయించాలని, అప్పటివరకూ ఎన్నికల నిర్వహణ నిలిపివేయాలని పిటిషనర్లు హైకోర్టును కోరారు. బీసీ సామాజికవర్గంలో ఏ, బీ, సీ, డీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్ విచారణ చేపట్టిన హైకోర్టు ఇదివరకే తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైనందున, ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. నామినేషన్ల ప్రక్రియ సైతం ప్రారంభమైంది. డిసెంబర్ 11, 14, 17 తేదీలలో మూడు దశలలో తెలంగాణ వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు షెడ్యూల్

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..


02
శనివారం
29-11-2025
WWW.DASHANEWS.COM



# ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి షాక్

**దశ, మునగాల:** మునగాల మండల తాడ్వాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ ముఖ్య నాయకుడు సిపిఐ (యం) పార్టీలో చేరినారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నుకునే తరుణంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలిందనే చెప్పవచ్చు. సీపీఐ(యం) పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా, దేశగాని నాగమ్మ యాదగిరి ను శుక్రవారం గ్రామములో జరిగిన సిపిఐ(యం) పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగమ్మ ను గ్రామంలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ఎర్రజెండను ఎగరువేయాలని గ్రామములో పూర్వవైభవం తీసుకురావాలని, దేశం మొత్తం కూడా కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు చూస్తున్నారని, పేదల పక్షాన నిలబడేది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, మాతంగి వెంకన్న, గ్రామ శాఖ పార్టీ కార్యదర్శి, నెమ్మది మనోజ్, బచ్చలకూరి స్వరాజ్యం, జిల్లేపల్లి శ్రీనివాస్, మాతంగి విజయ్, లక్యా నాయక్, కొలిశెట్టి శేషయ్య, నాగయ్య, దేశగాని యాదగిరి, గ్రామ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : బ్యాంకు ఛైర్మెన్ జైపాల్ రెడ్డి




**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. సంఘం పరిధిలోని బుర్ర పెద్దదాసు గత జూన్ లో చనిపోయారని ఈ సందర్భంగా రైతులను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన బుర్ర జయమ్మ కు 25 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్ , నాయకులు తూర్పునూర్ ప్రభాకర్ , బుర్ర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దీక్షా దివాస్'కు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లాలి: తొగరు రమేష్

**దశ మునగాల:** సూర్యాపేట మార్కెట్ యార్డ్ దగ్గర బతుకమ్మ ఘాటు నేడు జరుగు సూర్యాపేట జిల్లా కేంద్రంలో 'దీక్షా దివాస్'కు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు మండల పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో గొప్ప ఘట్టానికి గుర్తుగా 'దీక్షా దివాస్' దశాబ్దంన్నర క్రితం, పార్టీ అధినేత కె.సి.ఆర్ గారు 'తెలంగాణ వచ్చుడో, కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగ నిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారునీ. తెలంగాణ చరిత్రలో ఘనమైన ఈ ఘట్టాన్ని పురస్కరించుకొని దీక్షా దివాస్‌ను పెద్దఎత్తున జిల్లా కేంద్రంలో నిర్వహించాలని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ గారి ఆదేశాల మేరకు దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూన్నారు. దీక్షా దివాస్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల నుండి పార్టీ శ్రేణులందరూ భారీ ఎత్తున తరలిరావాలని అన్నారు.

## ఎలక్షన్ వద్దు ఏకగ్రీవమే ముద్దు

- *మాజీ జడ్పీటీసి ఎల్ హెచ్ పి హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్*



**దశ, ఆమనగల్లు :** "ఎలక్షన్ వద్దు ఏకగ్రీవమే ముద్దు" అని మాజీ జడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ఎన్నికలలో పోట పోటికి పోవడం వల్ల బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడడమే తప్ప ప్రయోజనం ఏమీ లేదని ఓటర్లకు సూచించారు. తమ గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండేటటువంటి వ్యక్తిని అన్ని రకాలుగా తమకు సహకరించే వ్యక్తిని ఎన్నుకొని ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో వ్యక్తి తప్ప పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వకూడదని తెలిపారు. గత ఎన్నికల్లో కడ్తాల్ మండలంలో ఐదు గ్రామపంచాయతీలో సర్పంచ్ మరియు వార్డు మెంబర్లను ఏకగ్రీవం చేశామని ఈ ఎన్నికల్లో దాదాపుగా అదే మాదిరిగా గ్రామపంచాయతీలో సర్పంచ్ లను, వార్డు మెంబర్లను ఏకగ్రీవం చేసుకొని అన్నదమ్ముల్లాగా ఒకే కుటుంబ సభ్యులు లాగా కలిసిమెలిసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆయా తండాల నాయకులు, లంబాడ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిసి జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



**దశ సూర్యాపేట ప్రతినిధి :** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త, తత్వవేత్త విద్యావేత్త, భారతదేశంలో సామాజిక న్యాయం అణగారిన వర్గాల హక్కులు మహిళా విద్య కోసం పోరాడిన తొలి యోధుడు అని అన్నారు. మొట్టమొదటిగా మహాత్మా అనే బిరుదు పొందిన తొలి భారతీయుడు జ్యోతిరావు పూలే సమాజంలో మార్పుకై విద్య అనేది అత్యంత శక్తివంతమైన సాధనం అని వారు గట్టిగా నమ్మారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సెక్రటేరియట్ నందు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలని సూర్యాపేట బీసీ జేఏసీ పక్షాన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా నాయకులు బైరోజు మదనాచారి, ముత్యం నాగేంద్రబాబు, యోగి, కాగితాల కిరణ్, కుమార్, నాగేంద్రబాబు, కూరాకుల శ్యామ్, జనార్ధన్, నాగార్జున, దుర్గాప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

- *సింగరేణి డైరెక్టర్ సూర్యనారాయణ*



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** క్రీడాకారులు గెలుపు ఓటములను క్రీడాస్ఫూర్తి తో సమానముగా స్వీకరించాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ అన్నారు. సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 202526 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం, రుద్రంపూర్ నందు మూడు రోజులపాటు నిర్వహించే కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఈ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సింగరేణి డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ కోల్ ఇండియా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలను సింగరేణి కొత్తగూడెం ఏరియా నిర్వహించుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఈ క్రీడా పోటీలలో గెలుపు ఓటములను సమానముగా తీసుకోవాలని కోరారు. ఈ కబడ్డీ పోటీలలో క్రీడాకారులు ఎటువంటి గాయాలు తగలకుండా జాగ్రతలు తీసుకుంటూ స్నేహభావంతో మూడు రోజుల కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ పోటీలలో పాల్గొనే కోల్ ఇండియా పరిధిలోని 8 బొగ్గు సంస్థల జట్లు అయిన సింగరేణి, బిసిసిఎల్, సిసిఎల్, ఈసిఎల్, ఎన్‌సిఎల్, ఎస్ఈసిఎల్, ఎంసిఎల్, డబల్యూసిఎల్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు అధ్యక్షతన జరిగిన ఈ కబడ్డీ ఆటల పోటీలలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(పి అండ్ పి)వెంకటేశ్వర్లు, డైరెక్టర్(ఈ అండ్ ఎం) ఎం.తిరుమల రావు, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్‌టియూసి)సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎం.వి.నరసింహా రావు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఎస్ఓ టు జిఎం జి.వి.కోటి రెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్య నారాయణ రాజు, ఏజిఎం(సివిల్) సిహెచ్.రామ కృష్ణ, డిజిఎం (పర్సనల్)లు జీ.వి. మోహన్ రావు, కేసా నారాయణరావు, వై.వి.ఎల్.వరప్రసాద్, బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కొత్తగూడెం ఏరియా గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ ఎ.ఉపేంద్ర బాబు, అధికారులు, యూనియన్ నాయకులు, స్పోర్ట్స్ ఆఫీసర్ కే.సునీల్, సూపర్వైజర్ లు, పర్సనల్, ఎస్ అండ్ పిసి, ఈ అండ్ఎం, సివిల్ శాఖల సిబ్బంది, బొగ్గు సంస్థల జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి లక్ష రూపాయల బీమా చెక్కు పంపిణీ




**దశ, ఎల్లారెడ్డిపేట:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో యజమానికి మంజూరు అయిన లక్ష రూపాయల బీమా చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు ఎల్లారెడ్డిపేట సి ఐ శ్రీనివాస్ గౌడ్ అందించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఈ ఏడాది జూన్ లో ఎల్లారెడ్డిపేటకు చెందిన ఆటో యజమాని నాగుల తిరుపతి తన ప్యాసింజర్ ఆటోతో గొల్లపల్లి నుండి ఎల్లారెడ్డిపేటకు వస్తున్న సమయంలో ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో నాగుల తిరుపతి నడుపుతున్న ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయింది.ఈ ప్రమాదంలో తిరుపతి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు.ప్రమాదంపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. గత సంవత్సరం జిల్లా ఎస్ పి మండలంలోని అందరూ ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి వారికి 200 రూపాయల తో ఇన్సూరెన్స్ చేయించారు. ప్రమాదంలో మృతి చెందిన నాగుల తిరుపతి కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ ద్వారా మంజూరు అయిన లక్ష రూపాయల చెక్కును ఎల్లారెడ్డిపేట సీఐ బి.శ్రీనివాస్ గౌడ్ ,ఎస్సై కే.రాహుల్ రెడ్డి లు పోలీస్ స్టేషన్లో మృతుని కుటుంబ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా మృతుడు తిరుపతి గౌడ్ కుటుంబ సభ్యులు పోలీస్ అధికారులకు, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ,ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

- *జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** డిసెంబర్ 2న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను సంబంధిత శాఖల ఇంజనీరింగ్ రోడ్లు భవనాలు విద్యుత్ పోలీస్ శాఖ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో చేపట్టాల్సిన ఏర్పాట్లు పనుల పురోగతి భద్రతా చర్యలు నిర్వహణ వంటి అంశాలపై అధికారుల నుండి వివరణలు కోరారు. శిలాఫలకం ఏర్పాటు ఆవరణ అభివృద్ధి అంతర్గత రోడ్ల మరమ్మత్తులు సందర్శకుల కోసం ఏర్పాటు చేయాల్సిన మార్గదర్శక బోర్డులు పార్కింగ్ స్థలాలు స్టేజీ నిర్మాణం విద్యుత్ సౌకర్యాల తనిఖీ వంటి అంశాలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ లోటుపాట్లు ఏవైనా ఉన్న వెంటనే సరిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రాధాన్యత



కలిగినదని అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయం సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటడం ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు శానిటేషన్ ఏర్పాట్లు పూర్తి చేసి ముఖ్యమంత్రి పర్యటన నాటికి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పర్యటన రూట్‌మ్యాప్ తుది రూపు, ట్రాఫిక్ సర్దుబాట్లు, అగ్నిమాపక చర్యలు, వైద్య బృందాల నియామకం, వీఐపి ప్రోటోకాల్ అమలు వంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- *మంచాల మండల బీఆర్ఎస్ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి*



**దశ, మంచాల :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ నాయకుడు కట్టుబడి పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి), పాల్గొని నాయకులతో ముఖ్య సూచనలు పంచుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించే దిశగా చేపట్టవలసిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ అంటే నాయకుడు కాదు సేవకుడు

- *నా జీవితం గుండారం కోసం అంకితం.*
- *ఇది నా ఆత్మ తో చేస్తున్న ప్రమాణం*
- *గుండారం సర్పంచ్ అభ్యర్థి మీ లక్ష్మి రాజూనాయక్*



**దశ ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామం లో సర్పంచ్ రిజర్వేషన్ జనరల్ మహిళా కావడంతో కాంగ్రెస్ పార్టీ యువజన మండల ఉపాధ్యక్షుడు బానోతురాజు నాయక్ తన భార్య లక్ష్మి నీ పోటిలో నిలుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్టు వారు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండారం గ్రామంలో రాజు నాయక్ గుండారం ప్రజల కోసం అనేక రకాల సామాజిక విప్లవ ఆలోచనతో గుండారం ప్రజల కోసం సేవ చేయాలని నిరంతరం పనిచేస్తున్నారు. వారు ఇప్పటివరకు గుండారం ప్రజలకు 130 సంచుల బియ్యం సంచులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వీటితోపాటు గురవయ్య పరం పోగు భూములను గుండారం ప్రజలకు పంచడానికి 15 రోజులు జైలుకు వెళ్లి రావడం జరిగిందన్నారు. గుండారంలో పోడు భూముల కమిటీ ఏర్పాటుకు దీనిద్వారా అంకురార్పణ జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘ సభ్యులు పసుల భూపతి, పసుల దేవయ్య, పసుల సత్తయ్య, పసుల రాములు, నమిలి కొండా రమేష్, పశువుల నవీన్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ యువజన అధ్యక్షుడు మూడవత్ తిరుపతి, చేపూరి బాల గౌడ్,గుగులోత్ నరసింహులు నాయక్,మూడవది రమేష్,భూక్యా నరేష్,మూడవత్ సాయి,భూక్యా శ్రీను, గుగులోత్ బీమ్ సింగ్, ఎస్సీ కాలనీ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా సైన్స్ దే : డాక్టర్ అందే సత్యం

- *ఘనంగా జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు*



**దశ సూర్యాపేట:** రేపటి భవిష్యత్తు అంతా సైన్స్ దే అని, అంతేకాకుండా ఈనాటి విద్యార్థులు సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని శాస్త్రీయ విజ్ఞానాన్ని వారి నిత్యజీవితంలో ఉపయోగించుకోవాలని, క్రమశిక్షణగా మెలిగి ఉన్నతమైన పౌరులుగా ఎదగాలని జనవిజ్ఞాన వేదిక పూర్వ అధ్యక్షుడు డాక్టర్ అందే సత్యం అన్నారు. శుక్రవారం స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నందు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా అధ్యక్షులు గోళ్లమూడి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ అందే సత్యం హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ లో గెలుపొందిన నాలుగు విభాగాల విద్యార్థులకు మెమెంటోలతో పాటు , పుస్తక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు శ్రవణ్ కుమార్, రాంబాబు, సూర్యనారాయణలు అతిథులుగా విచ్చేసి విద్యార్థులలో శాస్త్రీయ స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపల్ జీవి విద్యాసాగర్, జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ విజయ మోహన్, రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ జాఫర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కలకుంట్ల సైదులు, గౌరవాధ్యక్షులు డివన్ స్వామి, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ యాదయ్య, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రయ్య, దయానంద్, జెవివి నాయకులు సోమ సురేష్, క్రాంతి కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సురేష్, చంద్రబాబు, సైదయ్య గౌడ్, రమణారెడ్డి ఇతర నాయకులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

03
శనివారం
29-11-2025
WWW.
DASHANEWS
.COM



## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి

**దశ, ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాషా నరహరి స్మారక కేంద్రం లో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్, సీనియర్ నాయకులు వెంకటేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోడ సామెల్ మాట్లాడుతు.. వెనుకబడిన బడుగు బలహీన వర్గాల హక్కులు కోసం మహిళలకు విద్యా అవకాశల కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు డి జెగదీశ్, సిపిఎం మండల కార్యదర్శి బుగ్గ రాములు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, పి జెగన్, డి కిషన్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఏ వెంకటేష్, సిహెచ్ ముషాలయ్య, సిపిఎం మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేశ, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఎర్పుల వీరేషం,గణేష్, నర్సింహా, రమేష్, గిరి, ప్రభాకర్, విజయ్, లింగమయ్య తదితరులున్నారు.



గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల కేంద్రాలను ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. మండల పరిధిలోని అబ్దుల్లాపూర్, లష్కర్ గూడ, అనాజ్ పూర్, బండ రావిరాల, బాటసింగారం గ్రామాలను సందర్శించి.. పోలింగ్ బూతుల కేంద్రాల, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ ఇన్ స్పెక్టర్ వి. అశోక్ రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్లు మాధవరావు, భద్యా నాయక్, ప్రియాంక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
— ( దశ,అబ్దుల్లాపూర్‌మెట్)



మహాత్మా జ్యోతిరావు పూలే గారి 135వ వర్ధంతి సందర్భంగా ఎల్.బి నగర్‌లో శుక్రవారం పూలే విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ DNT-NT అడ్వకేట్స్ ఫోరం అధ్యక్షులు, సీనియర్ లాయర్ గుండ్లపల్లి సత్యనారాయణ హాజరై ఉద్యమ శైలిలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘం అధ్యక్షులు బెక్కాం వెంకట్, బీసీ నాయకులు వెంకటేష్ గౌడ్, సామాజిక కార్యకర్తలు పాల్గొని పూలే గారి సేవలు, త్యాగాలను స్ఫూర్తిగా గుర్తుచేసుకున్నారు. — (దశ, ఎల్బీ నగర్)



## రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఆమనగల్లు విద్యార్థులు

**దశ, ఆమనగల్లు:** రాష్ట్రస్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ పోటీలకు ఆమనగల్లు విద్యార్థులు చరణ్, వంశీ,శివ,రాకేష్, ఎంపికైనట్లు పాఠశాల టీచర్లు తెలిపారు. శుక్రవారం శివరాంపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభా కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వారు వివరించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు భాస్కర్, నరేష్,నజీర్, సునీత,సన్మానించి అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు వెంటనే అమలు చేయాలి

- *జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలి*
- *తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ రణభేరి బహిరంగసభలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ*
- *మోకు, ముస్తాదులు, తాటి, ఈత కొమ్మలతో ర్యాలీలో పాల్గొన్న గీత కార్మికులు*




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కల్లుగీత కార్మికులకు ఇస్తామని ప్రకటించిన హామీలు అమలు చేయకపోతే రేవంత్ ప్రభుత్వానికి చెయ్యి ఇవ్వడం ఖాయమని తెలంగాణ కల్లుగీత సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న నేటికీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు అన్నారు. సర్వాయి పాపన్న విగ్రహాలకు పూల మాలలు వేసి దండాలు పెడుతున్న పాలకులు సర్వాయి పాపన్న వారసులైన కల్లుగీత కార్మికుల సంక్షేమాన్ని మాత్రం పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలలో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. కల్లుగీత కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

**కల్లుగీత వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కిట్టు ఇవ్వాలి: బెల్లంకొండ వెంకటేశ్వర్లు**

కల్లుగీత వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న కల్లుగీత కార్మికుల ఎక్స్ గ్రేషియాలు వెంటనే చెల్లించాలన్నారు. మీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ నెలకొల్పాలన్నారు. కల్లు గీత కార్పొరేషన్ కు 5000 కోట్లు కేటాయించి గీతా కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కల్లులోని పోషకాలను, ఔషధ గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేయాలన్నారు.

**పాటల సిడి ఆవిష్కరణ**

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ రచించిగా ప్రముఖ కళాకారులు మానుకోట ప్రసాద్ ఆలపించిన "మోకు పైలం మోయి గౌడ బింకి పైల మోయి గౌడ" అనే పాటల సిడిని హైదరాబాద్ సుప్రజా హాస్పిటల్ ఎండి సిగ విజయ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులు మానుకోట ప్రసాద్, సందీప్, శ్రీకాంత్ ఆలపించిన గేయాలు కల్లుగీత కార్మికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కల్లుగీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎలుగురి గోవిందు అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ చౌగాని సీతారాములు, బోలగాని జయరాములు, గౌని వెంకన్న, బొల్లె వెంకట మల్లయ్య, ఎస్ రమేష్ గౌడ్, బూడిద గోపి, పామన గుండ్ల అచ్చాలు, ఉష గాని వెంకట నరసయ్య, బండ కింది అరుణ్, గౌరీ అంజయ్య, జిల్లా నాయకులు కక్కిరేణి నాగయ్య, బైరు వెంకన్న గౌడ్, టైసన్ శ్రీను, ఉయ్యాల నగేష్, మడ్డి అంజిబాబు, బత్తుల జనార్ధన్, తుమ్మల సైదయ్య, గుణగంటి కృష్ణ, అబ్బగాని బిక్షం, బోడ పట్ల జయమ్మ, మద్దెల జ్యోతి, నోముల వెంకన్న, జెర్రిపోతుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ముక్కోటి ఏర్పాట్లు చేయండి

- *భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి*
- *అధికారులకు కలెక్టర్ సూచన*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 29న నిర్వహించు తెప్పోత్సవం, 30న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం కళ్యాణ మండపం అధ్యయన వేదిక క్యూ లైన్‌లు భక్తుల కోసం సెక్టార్ వైజ్ ఏర్పాట్లు వంటి అంశాలపై దేవస్థానం అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.

మిథిలా స్టేడియం ఉత్తర ద్వారం ప్రాంతంలో క్యూ లైన్‌ల ఏర్పాటు భక్తుల ప్రవేశ నిష్క్రమణ మార్గాలు భద్రతా బలగాల మోహరింపు త్రాగునీరు వైద్య సేవలు శానిటేషన్ మొబైల్ టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలను కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి చేరుకునే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం లేకుండా చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని వైద్య విభాగం 24 గంటలు అంబులెన్స్‌లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఉత్తర ద్వారం వద్ద బారికేడింగ్, క్యూలైన్ కవర్లు, లైటింగ్, సీసీ కెమెరాలు, సమాచార ప్యానెల్స్ ఏర్పాటు వంటి పనుల పురోగతిని ఇంజినీరింగ్ విభాగం అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భద్రతా పరంగా పోలీసు విభాగం, దేవస్థానం విజిలెన్స్, శానిటరీ సిబ్బంది అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పని చేయాలని ఆయన సూచించారు. భక్తులకు సులభ దర్శనం అందించడం ప్రధానం కావడంతో రెస్టింగ్ పాయింట్లు, మెడికల్ క్యాంపులు వంటి ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని కలెక్టర్ హెచ్చరించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే సమయాల్లో అదనపు వాలంటీర్లు, సిబ్బంది మోహరించాలని సూచించారు.

దేవస్థానం పరిసరాల్లో స్వచ్ఛత, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు కూడా కీలకమని పేర్కొంటూ పంచాయతీ శాఖతో దేవస్థానం అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగం రోజువారీ పురోగతి నివేదికను సమర్పించి నిర్ణీత గడువులో అన్ని పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

ఎటువంటి విభాగం నిర్లక్ష్యం చూపకూడదని హెచ్చరిస్తూ భక్తుల సౌకర్యం దృష్టిలో ఉంచుకుని మొత్తం ఏర్పాట్లను అత్యుత్తమంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ పాటిల్ స్పష్టం చేశారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈఓలు శ్రవణ్ కుమార్, భవానీ, రామకృష్ణారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ దిక్సూచి, సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

**టిఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతే రాజిరెడ్డి**

**దశ రాజన్న సిరిసిల్ల జిల్లా:** సామాజిక న్యాయం,మహిళా విద్య, సమాన హక్కుల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతినీ పురస్కరించుకొని ఈ సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటూ సిరిసిల్ల పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వారికి ఘన నివాళులు అర్పించిన టిఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షులు, టిడిపి వేములవాడ నియోజకవర్గ అడాహాక్ కమిటీ సభ్యులు మోతె రాజిరెడ్డి.ఈ సందర్భంగా మోతె రాజిరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన భాందవుడు, సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్యస్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మిద్దె ప్రకాష్ పాల్గొన్నారు.



## నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించోచ్చు: డి. సి. ఓ., సిహెచ్ పద్మ



**దశ , నడిగూడెం :** అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు నిరంతర సాధన చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిసిఓ సిహెచ్. పద్మ అన్నారు. శుక్రవారం నడిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గురుకుల విద్యకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని, గురుకులాల్లో సీట్లు సాధించటం తమ అదృష్టంగా భావించాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు అదేవిధంగా పలు రకాల టెస్టులను నిర్వహించి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గురుకుల విద్యాలయాలు పేద విద్యార్థులకు ఒక వరం అన్నారు. మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలన్నారు. ఆత్మవిశ్వాసంతో చదువుకోవాలని తద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ కూడా ప్రకటించినందున ఇక విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయ శ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 60 రోజులకు చేరిన ఓయూ అధ్యాపకుల నిరసనలు

**దశ ఓయూ:** ప్రమోషన్స్లో తీరని అన్యాయం జరిగిందంటూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు 60 రోజులకు చేరాయి. శుక్రవారం ఓయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలనీ దాదాపుగా రెండు నెలల నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నా ఓయూ వైస్ చాన్సలర్ స్పందించక పోవడం దారుణం అన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అవసరమైతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామన్నారు. దానికి యూనివర్సిటీ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. గతంలో ఓయూ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్రెడ్డి డిసెంబర్లో పర్యటిస్తానని చెప్పిన నేపథ్యంలో అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలనీ కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఔటా అధ్యక్షులు ప్రొ మనోహర్, ప్రొఫెసర్లు కమలాకర్,రామ్చందర్, వెంకటదాస్, వెంకటేశ్వర్రావు, లోకండే, మాధురీ, అరవింద్, సుజాత, శశికళ, రామకృష్ణగౌడ్, రాకేష్ తదితరులున్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..



## కెసిఆర్ చారిత్రాత్మక దీక్షకు 16 ఏళ్ళు..!

**దశ, సిద్దిపేట:** తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన దీక్షకు పదహారేళ్లు . ఈ నేపద్యంలో శనివారం నాడు సిద్దిపేట లో ఘనంగా దీక్షా దివస్ వేడుకలు నిర్వహించనున్నారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుండి పొన్నాల జిల్లా పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ వుంటుంది. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు,దుబ్బాక ఎమ్మెల్యే జిల్లా పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ లు యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర ను మలుపు తిప్పిన రోజు కెసిఆర్ దీక్ష ఆ స్ఫూర్తి తో 16 ఏళ్ళు దీక్షా దివస్ జరుపుతున్నాం స్వరాష్ట్ర కలను నిర్దేశించిన రోజు గా నవంబర్ 29 దీక్షా దివస్ గా చేసుకోబోతున్నామని అన్నారు.




# మెగా సిటీగా హైదరాబాద్

**నవాబుల కాలం నాటి భాగ్యనగరం మరో చారిత్రక మలుపు.**

**రాష్ట పట్టణీకరణ చరిత్రలోనే ఇది ఒక కీలక ఘట్టం.**

**47 మండలాలు, 311 గ్రామాలతో కూడిన ఈ కొత్త నగరం.**



**దశ, హైదరాబాద్:** నవాబుల కాలం నాటి భాగ్యనగరం మరో చారిత్రక మలుపు తిరగబోతోంది. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ , ఇకపై బృహత్ నగరంగా అవతరించనుంది. అవుటర్ రింగ్ రోడ్ ను ప్రామాణికంగా తీసుకుని, దాని లోపల, ఆనుకుని ఉన్న 27 నగర, పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పట్టణీకరణ చరిత్రలోనే ఇది ఒక కీలక ఘట్టం అని చెప్పొచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయం, నగర భౌగోళిక, రాజకీయ, పరిపాలనా స్వరూపాన్ని పూర్తిగా మార్చేయనుంది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న 27 పట్టణ స్థానిక సంస్థలు ఇప్పుడు జీహెచ్ఎంసీలో అంతర్భాగం కానున్నాయి. ఈ మహా విలీన ప్రక్రియ పూర్తయితే హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద నగరాల్లో ఒకటిగా, కొన్ని చిన్న రాష్ట్రాల జనాభాతో సమానంగా ఎదగనుంది. ఈ బృహత్ నగరం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి సహా మొత్తం 5 జిల్లాల పరిధిలో విస్తరించి ఉంటుంది. 47 మండలాలు, 311 గ్రామాలతో కూడిన ఈ కొత్త నగర పరిధిలో ఏకంగా 6 పార్లమెంటు స్థానాలు, 28 అసెంబ్లీ స్థానాలు ఉండటం గమనార్హం. అంటే రాష్ట్ర రాజకీయాల్లో సగానికి పైగా ప్రభావం ఈ ఒక్క నగరానిదే కానుంది. ప్రస్తుతం 1.45 కోట్లుగా ఉన్న జనాభా, ఓఆర్ఆర్ వరకు విస్తరిస్తే 1.70 కోట్లకు చేరుతుంది. రాబోయే జనగణన నాటికి ఇది 2 కోట్లను దాటే అవకాశం ఉందని అంచనా.బడంగ్‌పేట్, నిజాంపేట్, మణికొండ వంటి ప్రాంతాలు ఇప్పటికే అధిక జనసాంద్రతతో కిక్కిరిసిపోయాయి, కానీ మౌలిక వసతుల్లో కోర్ సిటీతో పోటీపడలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో నగర ప్రజలందరి నుంచి వసూలు చేసే పన్నుల్లో వ్యత్యాసాలు లేకుండా చూడటం ముఖ్యం. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రతి ప్రాంతానికి జీహెచ్ఎంసీ స్థాయి డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సరఫరాను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. వేర్వేరు మున్సిపల్ చట్టాల వల్ల వస్తున్న ఇబ్బందులను తొలగించి, ఒకే గొడుగు కిందకు పాలనను తీసుకురావడం ద్వారా పరిపాలన సౌలభ్యం కలుగుతుందివచ్చే ఏడాది ఫిబ్రవరితో ప్రస్తుత జీహెచ్ఎంసీ పాలకవర్గం పదవీకాలం ముగుస్తుంది. అయితే, ఈ లోపు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. 27 మున్సిపాలిటీల విలీనానికి అవసరమైన జీహెచ్ఎంసీ చట్టం, తెలంగాణ మున్సిపల్ చట్టాల' సవరణలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ నిర్ణయంతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ జోన్ మొదలుకొని, ఐటీ కారిడార్‌లోని తెల్లాపూర్, నిజాంపేట్ వరకు, అలాగే ఉప్పల్ వైపున్న పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ వరకు అంతా ఒకే మహానగరంగా మారుతుంది. ఇది అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఇప్పటికే సిబ్బంది కొరత, నిధుల లేమితో సతమతమవుతున్న జీహెచ్ఎంసీ, కొత్తగా వచ్చి చేరే ఈ 27 ప్రాంతాల భారాన్ని, అక్కడి ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తుందనేదే రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు.

## సమ్మిట్ కు భారీ బందోబస్తు

**దశ, రంగారెడ్డి:** డిసెంబర్ 8, 9వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహేశ్వరం, మిర్ఖాన్ పేటలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి పోలీసుశాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య భారీ బందోబస్త్ కల్పిస్తోంది. శుక్రవారం మహేశ్వరంలో బందోబస్త్ మీద రాచకొండ సిపి సుధీర్ బాబు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, టీజీ ఐసీసీ ఎండి శశాంక్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ట్రాఫిక్ డీసీపీలతో కలిసి టి రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కమిటీ సభ్యులతో, వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారినుండి పోలీసు శాఖకు ఎలాంటి సహాయ సహకారాలు అందించాలి, పోలీసు శాఖ నుండి వారికి ఎలాంటి సహాయ సహకారాలు ఇవ్వాలి అనేదానిపై నిర్వాహక కమిటీ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సుకు సుమారు 2,500 మంది పోలీసు బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్స్తో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, రూట్ మ్యాప్ లు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయి. మహిళా పారిశ్రామికవేత్తలు, వక్తల, పెట్టుబడిదారుల భద్రత, రక్షణ కోసం ఉమెన్స్ వింగ్, షీ టీమ్స్ ప్రత్యేకంగా వింగ్ నీ ఏర్పాటు చేశారు.


## కొరియర్, పార్శిల్స్ లో డ్రగ్స్ రవాణా

**దశ, హైదరాబాద్:** ఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీం చేపట్టిన ఆపరేషన్ బిగ్ సక్సెస్ అయ్యింది. హైదరాబాద్లో పలు కేసుల విచారణలో డ్రగ్స్ మాఫియా బయటపడింది. దీంతో ఢిల్లీలోని 20 ప్రాంతాలకు పైగా తనిఖీలు చేపట్టి 16 విక్రయ కేంద్రాలను గుర్తించారు. ఈ క్రమంలో 50 మంది నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. కొరియర్, పార్శిల్స్ సర్వీసులో డ్రగ్స్ సరఫరా చేసినట్టు గుర్తించారు. నైజీరియాకు చెందిన నిక్కీ ఏజెంట్లను నియమించుకున్నట్టు వెల్లడించారు.

## భూముల రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం

దశ, హైద్రాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ, అటవీ, దేవాదాయ భూముల అక్రమ క్రయ విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22(ఏ) కింద రూపొందించిన నిషేధిత భూముల జాబితా రికార్డులను డిసెంబర్ 3వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటుకి తీసుకురానుంది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు ఈ జాబితాలను సిద్ధం చేశారు. వీటిలో తప్పులు దొర్లడంతో సవరణల అనంతరం ఈ తుది జాబితాను పబ్లిక్ డొమైన్లో ఉంచడానికి రిజిస్ట్రేషన్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడనుంది.

## శంకర్ పల్లిలో కారును ఢీకొట్టిన బస్సు.. కారు దగ్ధం.



**దశ, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లిలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. కారును బస్సు ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా కారులో నుంచి మంటలు చెలరేగాయి. వాహనదారులు డ్రైవర్ ను సురక్షితంగా కాపాడారు. క్షణాల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. మితిమీరిన వేగంతో దూసుకొచ్చి కారును బస్సు ఢీకొట్టింది. బస్సుకు మంటలు అంటుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వికారాబాద్ నుండి శంకర్ పల్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. శంకర్ పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగడంతో క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలగించారు.

## హైదరాబాదీ రుచులకు గ్లోబల్ గుర్తింపు

**మొదటి పేజీ తరువాయి**

పర్యాటకం, జీవనశైలి అన్ని విభాగాల్లో ఈ నగరాలు ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి.భారతదేశంలో బెంగళూరు టాప్ లో నిలిచింది. టెక్ ఎకోసిస్టం, విస్తరించిన కార్పొరేట్ బేస్ వల్ల బెంగళూరు 29వ స్థానాన్ని సాధించింది. ఉద్యోగాలు, సాంస్కృతిక కార్యకలాపాలు, ఇన్నొవేషన్ కేంద్రంగా దేశ ఆర్థిక రాజధాని ముంబై 40వ స్థానంలో నిలిచింది. రాజకీయ ప్రభావం, రవాణా కనెక్టివిటీ, అభివృద్ధి చెందుతున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా ఢిల్లీ 54వ స్థానంలో నిలిచింది. ఇక టెక్నాలజీ విస్తరణ, ఐటీ సేవల కేంద్రంగా ఎదుగుతున్న హైదరాబాద్ 82వ స్థానంలో సాధించింది. మరోవైపు.. దేశంలోనే పెద్ద సిటీగా హైదరాబాద్ నిలిచింది. మరోవైపు.. చెన్నై, కోల్‌కతా వంటి నగరాలనుసైతం పక్కన పెట్టి హైదరాబాద్ ముందంజలో నిలిచింది.రోజురోజుకూ హైదరాబాద్ గ్లోబల్ ఇమేజ్ మరింత బలపడుతోంది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో వరుసగా మెరుగైన స్థానాలు సాధించడం హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిని మరో మెట్టుపైకి తీసుకెళ్తోంది. టెక్ సిటీగా గుర్తింపు, సురక్షిత నగరంగా పేరుగాంచడం, ఫుడ్ డెస్టినేషన్‌గా ఎదగడం హైదరాబాద్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. రాబోయే సంవత్సరాల్లో మరింత ఉన్నత స్థానాలను అందుకునే సామర్థ్యం నగరానికి ఉందని నిపుణులు భావిస్తున్నారు.



## నార్త్ ఈస్ట్ కనెక్ట్ అసోసియేషన్(ఎన్ఈసీఏ)ను ప్రారంభించిన గవర్నర్

దశ, హైదరాబాద్ : నార్త్ స్ట్ కనెక్ట్ అసోసియేషన్ (ఎన్ ఈ సీ ఏ)ను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ 2025 ముగింపు ఉత్సవాల్లో భాగంగా రాజ్‌భవన్‌లో ఈ వేడుక నిర్వహించారు. దేశం మొత్తం మీద ఈ తరహాలో కార్యక్రమాన్ని నిర్వహించడం, విజయవంతం చేయడం ఇదే తొలిసారిగా అభివర్ణిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణలోని పలు పరిశ్రమలకు, సంస్థలకు మధ్య ఎంఓయూలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వం అనే మన దేశ నినాదాన్ని ఎన్ఈసీఏ ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమైక్యతే ధ్యేయంగా, అభివృద్ధి దశగా కృషి చేస్తుందన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాల విషయంలో సముచితమైన మార్పు వస్తుందన్నారు. ఈశన్య రాష్ట్రాల, తెలంగాణ ప్రజల మధ్య సమైక్యతకు ఈ పనిచేయడమే ధ్యేయమని అధ్యక్షుడు పాపారావు బియ్యాల, ఉపాధ్యక్షుడు గౌతమ్ సావంగ్ తెలిపారు. అందుకోసం తమ ప్లాట్‌ఫార్మ్ వారధిలా పనిచేస్తుందన్నారు. బాంధవ్యాలు బలోపేతం అయ్యేలా సానుకూల దృక్పథంతో కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, డాక్టర్ ఎస్. సహారియా, శ్రీధర్ రెడ్డి, పాపా రావు బియ్యాల, ప్రొ. అజైలు నియుమై, గౌతమ్ సవాంగ్, స్టీఫెన్ సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కోకాపేటలో ఎకరం రూ.151.25 కోట్లు



**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో భూములు.. కో అంటే కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈవేలంలో ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. లక్ష్మీనారాయణ కంపెనీ ప్లాట్ నంబరు 15లో 4.03 ఎకరాలు.. ఎకరం రూ.151.25 కోట్లు చొప్పున, గోద్రెజ్ ప్రాపర్టీస్ ప్లాట్ నంబరు 16లో 5.03 ఎకరాలు.. ఎకరం రూ.147.75కోట్ల చొప్పున దక్కించుకున్నాయి. నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 15, 16లోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా.. రూ.1,353 కోట్ల ఆదాయం లభించింది. ఈ లేఔట్ లో హెచ్ఎండీఏ ప్రారంభ ధర రూ.99కోట్లుగా నిర్ణయించింది.

## మెట్రో స్టేషన్లలో అందుబాటులోకి స్మార్ట్ లాకర్లు

**దశ, హైదరాబాద్:** మెట్రో స్టేషన్లలో స్మార్ట్ లాకర్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల హెల్మెట్లు, సామాన్లు, షాపింగ్ బ్యాగులు, బ్యాక్‌ప్యాక్‌లు ఇతర వ్యక్తిగత వస్తువులను సురక్షితంగా భద్రపరిచేందుకు ఈ స్మార్ట్ లాకర్లు ఉపయోగపడతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం స్మార్ట్ లాకర్‌లను ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో ఇవాళ ప్రారంభించారు. ఎల్అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్, టక్కీట్ భాగస్వామ్యంతో హైదరాబాద్ నగరంలోని ఏడు మెట్రో స్టేషన్లలో ఆన్‌డిమాండ్ స్మార్ట్ స్టోరేజ్ లాకర్ల సౌకర్యాన్ని ఇవాళ్టి నుంచి అందుబాటులోకి తెచ్చింది. టక్కీట్‌తో భాగస్వామ్యం.. తమ స్టేషన్లలోకి స్మార్ట్, సురక్షితమైన, అనుకూలమైన స్టోరేజ్ పరిష్కారాన్ని తీసుకువస్తుందని ఎల్అండ్‌టీ, ఎంఆర్‌హెచ్ఎల్ ఎండీ కేవీబీ రెడ్డి పేర్కొన్నారు.

# 305 పరిశ్రమల మూసివేతలకు నోటీసులు

## కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించడంలో విఫలం

**దశ, హైదరాబాద్:** కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు 305 పరిశ్రమలను మూసివేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశించింది. పర్యావరణ చట్టాల అమలును బలోపేతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతమైన కాలుష్య నియంత్రణను నిర్ధారించడం ఈ చర్య లక్ష్యంగా తెలుస్తోందికాలుష్య తీవ్రత ఆధారంగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్‌గా వర్గీకరిస్తుందని టీజీపీసీబీ అధికారులు తెలిపారు. ఈ కేటగిరీల కింద తెలంగాణలో మొత్తం 12,264 పరిశ్రమలు ఉన్నాయి. ఈ వర్గీకరణకు అనుగుణంగా టీజీపీసీబీ కొత్త, ఇప్పటికే ఉన్న పారిశ్రామిక యూనిట్లను నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు.జనవరి 2024 నుంచి అక్టోబర్ 2025 మధ్య బోర్డు 2,620 కొత్త కంపెనీల స్థాపనకు అనుమతులు మంజూరు చేసింది. వాయు, నీటి కాలుష్య నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని ధృవీకరించిన తర్వాత 3,521 యూనిట్లకు ఆపరేషన్ కోసం సమ్మతి జారీ చేసింది. ఇదే కాలంలో అధికారులు 2,069 పరిశ్రమలను తనిఖీ చేసి, కఠినమైన కాలుష్య నిర్వహణను నిర్ధారించడానికి ఉల్లంఘనలకు 1,234 యూనిట్లకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలను పాటించలేదని నిర్ధారించిన తర్వాత ఔషధ యూనిట్లు, ప్లాస్టిక్ పరిశ్రమలు, రసాయన కర్మాగారాలు సహా 305 పరిశ్రమలకు మూసివేత ఉత్తర్వులు జారీ అయ్యాయిఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం TGPCB టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 10741, 'జనవాణి కాలుష్య నివారిణి' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. పారిశ్రామిక జోన్‌లలో రాత్రి పెట్రోలింగ్ కూడా చేస్తారు. బల్క్ డ్రగ్, రసాయన పరిశ్రమలలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థలను కఠినంగా అమలు చేయడం, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం వంటి ప్రభావవంతమైన చర్యలు కాలుష్య తగ్గింపుకు దోహదం చేస్తున్నాయి501 అధిక కాలుష్య కారక పరిశ్రమల నుండి ఉద్గారాలను, కాలుష్య కారకాలను నిరంతరం ట్రాక్ చేయడానికి 24/7 ఆన్‌లైన్ మానిటరింగ్ సెల్‌ఏ ర్పాటు చేసినట్టుగా ఓ అధికారి తెలిపారు. కాలుష్య నిబంధనలను అధిగమించినందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ 108 పరిశ్రమలను సమీక్షించింది. తక్షణ దిద్దుబాటు చర్యలను ఆదేశించింది. నిరంతరం పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్(హిల్ట్) పాలసీని ఆమోదిస్తూ అధికారిక ఉత్తర్వు జారీ చేసింది. దీని ద్వారా ఔటర్ రింగ్రో డ్ (ఓఆర్ఆర్) లోపల, చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగ జోన్లుగా అధికారికంగా మార్చడానికి వీలు కల్పిస్తుంది.

హైదరాబాద్ సిటీ లోపల ఉన్న కాలుష్యకారక, ఔట్‌డేటెడ్ టెక్నాలజీతో నడుస్తున్న పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలిస్తారు. ఈ హిల్ట్ పాలసీ అమలులో భాగంగానే తాజాగా పరిశ్రమలపై ప్రభుత్వం ఫోకస్ చేస్తోందని కొందరు భావిస్తున్నారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.